క్లుప్తంగా

గురుకుల పాఠశాల సందర్శన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కె రామ కృష్ణ, స్వేరో స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు శివశంకర్, శంకర్ నాయక్‌లు మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందించాలని కోరారు. మహేష్, బాలనాగులు, సంతప్, రాజేష్, భాస్కర్ ఉన్నారు.

అసత్య ప్రచారం తగదు

బల్మూర్: మండలంలోని గోదల్‌లో ఈనెల 7న కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో 120 మంది ఎమ్మెల్యే సమక్షంలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించడం అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగయ్య, ఉప సర్పంచ్ జమీల్‌లు మంగళవారం ప్రకటనలో ఖండించారు. కేవలం ముగ్గురిని మాత్రమే చేర్చుకొని 120 మంది చేరినట్లు అసత్య ప్రచారాలు చేయడం తగదని పేర్కొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

కల్వకుర్తిరూరల్: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు పోటీలలను నిర్వహించి గెలుపొందిన వారికి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు బహుమతులను అందజేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అశోక్, జగదీశ్వర్, కల్మిచర్ల గోపాల్, శ్రీధర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు నిప్పంటించిన దుండగులు

వెల్దండ: మండలంలోని పోతేపల్లి మాజీ సర్పంచ్ ఇంటి ముందు ఉన్న బైక్‌కు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త సత్యనారాయణ ఇంటి ముందు బైక్ నిలిపి నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పు అంటించారు. గమనించిన చుట్టు పక్కల వారు సమాచారం అందించారు. బాధితుడు లేచి చూసేసరికి బైక్ పూర్తిగా కాలిపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చారకొండ: పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసిన ఘటన మండలంలోని గోకారం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గోకారం శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. రూ.10 వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోర్టుకు హాజరు

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో భాగంగా కేసులు నమోదైన నాయకులు మంగళవారం కల్వకుర్తి కోర్టుకు హాజరయ్యారు. కోర్టుకు హాజరైన వారిలో మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, గంగాధర్, షాకీర్, రాహుల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

కొడి పీర్ల పండుగ ప్రారంభం

చారకొండ: మండలంలోని జూపల్లిలో మొహర్రం అనంతరం నిర్వహించే అక్బర్ అలీ కొడి పీర్లపండుగ మంగళవారం నుంచి ప్రారంభం అయినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 11వ తేదీ రాత్రి సరిగెత్తు, మాలిజ, ఫాతేహ, 12వ తేదీ పీర్ల నిమజ్జనం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

కోడేరు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని స్టేట్ రీసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని భాషా ప్రమాణాలపై నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండీ షర్ఫుద్దీన్, మణికంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలకు నీరందించాలి

బిజినేపల్లి: హరితహారం పథకం కింద నాటిన మొక్కలకు తప్పకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీరు అందించాలని ఎంపీడీవో కృష్ణయ్య సూచించారు. మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శాయిన్‌పల్లిలో పర్యటించి రికార్డులు, అవెన్యూ ప్లాంటేషన్, మిషన్ ఇంద్రధనుష్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

రైల్వే లైన్ మంజూరుపై హర్షం

కల్వకుర్తిరూరల్: గద్వాల నుంచి సూర్యపేట వరకు 296 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం రూ.740 కోట్ల నిధులు మంజూరు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణాధ్యక్షుడు నర్సింహా మాట్లాడారు. రైల్వే లైన్ పూర్తయితే నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు కల్వకుర్తి అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, బాబీదేవ్, నరేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



తెలకపల్లిలో ..



అచ్చంపేటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: గ్రామాలభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శాంతాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు ప్రగతి పనులను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడు నూతన అంబులెన్సులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హేమలత, మిషన్ భగీరథ డీఈఈ మణిపాల్, ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, సీడీపీఓ దమయంతి, లోక్యానాయక్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీటిపై ఏఈ సందీప్‌కుమార్‌రెడ్డి సభ్యులతో చర్చించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. జెడ్పీటీసీ సుమిత్ర, ఎంపీటీసీలు జింకల ఈశ్వరయ్య, యాతం బాలయ్య, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నీలమ్మ, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కొండ వెంకటరాధ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతులు చేయాలని నర్సాయిపల్లి సర్పంచ్ సత్యనారాయణయాదవ్ మిషన్ భగీరథ ఏఈ బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా విద్య, విద్యుత్, ఆరోగ్యం, పారిశుద్ధ్యం సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ వివరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీరాం, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల వంటావార్పు



నాగర్‌కర్నూల్‌లో ఏఎన్‌ఎంలతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ప్రకటించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కందికొండ గీత, ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, హైమావతి, శిరీష, నాగమణి, అనురాధ, వెన్నల, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: వైద్యశాఖలో రెండో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఎన్‌ఎంలు ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌కు మంగళవారం పోస్టుకార్డు పంపించారు. మంగళవారం పట్టణంలోని పోస్టాఫీస్‌లో పోస్టుకార్డు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండో ఏఎన్‌ఎంల జిల్లా అధ్యక్షురాలు ఫర్వీనా, సభ్యులు సుజాత, భాగ్యమ్మ, శంకుతల, తిరుపతమ్మ, శ్రీవిద్య, మంజుల, రాధ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

అచ్చంపేట రూరల్: పట్టణాభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఎజెండా అంశాలను సిబ్బంది మధు చదివి వినిపించారు. అనంతరం కౌన్సిలర్లు వార్డులలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పలు వార్డులలో ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రతి నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ మాట్లాడారు. అన్ని వార్డుల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. అంతకుముందు ప్రజా యుద్ధనౌక గద్దర్, సాయిచంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు సునితారెడ్డి, తగురం శ్రీనివాసులు, మనోహర్‌ప్రసాద్, గౌరీశంకర్, శివ, సోమ్లానాయక్, రమేష్‌రావు, మేనేజర్ అనిత, ఏఈ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

పేదలకు అండగా ఉంటా

కల్వకుర్తిరూరల్: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రఘుపతిపేట, తుర్కలపల్లి, గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 25 మంది కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. మండలంలోని తుర్కలపల్లిలో బాలమ్మ అనే వృద్ధురాలి ఇంటి నిర్మాణానికి రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.లక్ష అందించారు. అనంతరం రఘుపతిపేట, తుర్కలపల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘుపతిపేట సర్పంచ్ బాలస్వామి, తుర్కలపల్లి మాజీ సర్పంచ్ బాలయ్య, బాలమ్మ, నాగరాజు, యుగందర్‌రెడ్డి, అనిల్ గౌడ్, అన్వర్ పాష, కుర్మయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, జయప్రకాశ్, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

రూ.25 వేల ఆర్థిక సాయం

కల్వకుర్తి: కల్వకుర్తి ఆర్టీసీ డిపో పరిధిలో దివ్యాంగులు బస్ పాస్‌ల మంజూరు కోసం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. డిపో మేనేజర్ శ్రీకాంత్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీవీ వితరణ

తెలకపల్లి: మండలంలోని గట్టురాయిపాకుల గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం ఎంపీటీసీ సభ్యుడు యాతం బాలయ్య సొంత ఖర్చులతో టీవీని వితరణ చేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుభాష్‌యాదవ్, నరేష్, శ్రీను, బాలస్వామి, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

చారకొండ: మండలంలోని జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దొంగలగుట్ట తండాకు చెందిన రాత్లావత్ బోడియా ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మాజీ సర్పంచ్ బాలేమియా, జేపల్లి సర్పంచ్ రవీందర్ రెడ్డి గ్రామంలో బాధిత కుటుంబసభ్యులకు ఎల్‌ఓసీ అందజేశారు.

పోస్టర్ విడుదల



కల్వకుర్తిరూరల్: ఈ నెల 12న పాత పింఛన్ సాధన కోసం నిర్వహిస్తున్నట్లు చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నర్సింహారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు.

పెద్దకొత్తపల్లి: ఈ నెల 13వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించనున్న సర్వాయి పాపన్న జయంతి సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం జై గౌడ ఉద్యమ జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్ విడుదల చేశారు.

పశువులకు టీకాలు

చారకొండ: పశువులకు ఉచితంగా అందిస్తున్నా టీకాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య అధికారి శివకుమార్ అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో మంగళవారం పశువులకు టీకాలు అందించారు. అదేవిధంగా లంపిస్కిన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. పశువులకు, జీవాలకు వ్యాక్సీన్‌లు అందిస్తామని పేర్కొన్నారు. వారి వెంట లైవ్ స్టాక్ అధికారి మధర్, గోపాల మిత్ర ఉన్నారు.

వైద్యశిబిరం

వెల్దండ: మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలల్లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప వైద్య పరీక్షలు చేయగా 20 మంది కళ్ల కలక ఉన్నట్లు గుర్తించి వారికి మందులను పంపిణీ చేశారు. కంటి వైద్యనిపుణులు వెంకటస్వామి, మౌనిక, సాయి ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లింగాల: మండల పరిషత్ కార్యాలయంలో 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరోద్దీన్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచు కోనేటి తిర్పతయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రవిశంకర్, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, సుధీర్‌గౌడ్, జిల్లా నాయకులు కేటీ తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారంను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కోరారు. పట్టణంలోని బాలసదన్‌లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం 28 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను అందించారు. డీడబ్ల్యూఓ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

బిజినేపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రాజెక్టు అధికారి అరుణాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నర్సింహులు, ఏపీఎం రజిత, సీసీ కమల, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

తెలకపల్లి: ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొమ్ము మధు మంగళవారం ఎక్సైజ్ ఎస్ జనార్దన్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో మద్యం దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, విజయలక్ష్మి, సర్పంచ్‌లు జమ్ములు, మల్లారెడ్డి, శ్రీధర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

కందనూలు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) శ్రీహరికోట ఆధ్వర్యంలో గత నెల 19వ తేదీ నుంచి 23వ వరకు అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహాల తయారీ, రాకెట్లు ప్రయోగించే విధానంపై నిర్వహించిన శిక్షణా శిబిరానికి జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయుడిని డీఈఓ గోవిందరాజు మంగళవారం అభినందించారు. కృష్ణారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు శెట్టి, ఉపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య

తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతుందని ఎంఈఓ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో విద్యార్థులకు అవగాహన కలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం

తాడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని బలాన్‌పల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటా తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండా నాగేష్, బాలస్వామి, శ్యాంసుందర్‌రెడ్డి, రాయుడు, ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఇక్బాల్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పాత తహసీల్దార్ దామోదర్ బదిలీపై భువనగిరి వెళ్లగా డీటీగా ఉన్న ఇక్బాల్ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువును పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. తాడూరులో పార్లమెంట్ బీఎంపీ ఇన్‌చార్జ్ విజయ్ డీటీ మహ్మద్ అలీకి వినతిపత్రం అందజేశారు. కొల్లాపూర్‌లో సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెల్దండలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు విన్నవించారు. బల్మూరులో సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్ విలేకరులతో మాట్లాడారు. తెలకపల్లిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే కేశవులు గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ స్వీకరించారు. కల్వకుర్తి, పెంట్లవెల్లిలో మీసేవ కేంద్రాలు కిటకిటలాడాయి.

–సాక్షి, నెట్‌వర్క్

బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

అచ్చంపేట రూరల్: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని బస్టాండు ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నుంచి భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. లలిత, ఎంఎం గౌడ్, తిర్పతమ్మ, శ్రీశైలం, బాలస్వామి, నాగేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న నిర్వహించే మహాపడావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారేడు శివశంకర్, ఐఎంటీయూసీ జిల్లా కార్యదర్శి తగిలి శ్రీనివాసులు, టీఎంటీయూసి జిల్లా నాయకులు బాలకృష్ణ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి టౌన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం మండలంలోని తోటపల్లిలోని వాగు వద్ద నుంచి జేసీబీ సహాయంతో ఇసుకను తోడుతునట్లు సోమవారం అర్ధరాత్రి సమాచారం అందింది. ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్లి చూడగా వాగులో ఇసుక లోడ్‌తో ఉన్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను, జేసీబీని గుర్తించారు. వాహనాలను సీజ్ చేయటంతో పాటుగా యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చీడపీడల నివారణకు చర్యలు

అమ్రాబాద్: పత్తి పంటకు ఆశించిన చీడపీడల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని పదర ఏఓ సురేష్ అన్నారు. మంగళవారం పదర మండలంలోని రాయలగండిలో రైతులు సాగుచేసిన పత్తి పంటలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. పత్తి పంటకు పచ్చ దోమ, పేను బంక ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు గుర్తించారు. నివారణ కోసం కాన్ఫిడార్ 35 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓ శ్రావణి ఉన్నారు.

రూ.లక్ష ఫిక్స్ డిపాజిట్



లింగాల: కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో లింగాల వాసి, ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కెతావత్ హతిరాంనాయక్ కుటుంబానికి ఏబీఎస్‌ఎస్ అండగా నిలిచింది. మంగళవారం ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జనరల్ కార్యదర్శి ఎల్.రాందాస్ నాయక్ మృతుడి కుమార్తెలు కెతావత్ జాన్సీ, భావనలకు ఒక్కొక్కరి పేరిట ఎస్‌బీఐలో రూ. 50 వేల చొప్పును రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు.

డ్రమ్‌సీడర్‌తో సమయం ఆదా

పెద్దకొత్తపల్లి: డ్రమ్‌సీడర్‌తో సమయం ఆదా అవుతుందని కొల్లాపూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు రవి అన్నారు. పెద్దకార్పాములలో మాజీ సర్పంచ్ దొండ శ్రీనివాసులు వ్యవసాయ పొలంలో మంగళవారం డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తనాలను విత్తే పద్ధతిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ జానకిరాం, రైతులు శ్రీనివాసులు, రవి, బాలరాజు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు చెంచు గూడానికి చెందిన చెంచు మహిళ చెన్నమ్మ సోమవారం పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్ చానల్ దగ్గర అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మంగళవారం బాధిత కుటుంబసభ్యులతో కలిసి ప్రాజెక్టు పనులు చేస్తున్న కంపెనీ కార్యాలయం ఎదుట గిరిజన నాయకులు ధర్నా చేపట్టారు. నిర్వాహకులు కొంతమేర నష్టపరిహారం ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎంపీటీసీ సభ్యుడు శంకర్ నాయక్, మొలచింతలపల్లి మాజీ సర్పంచ్ వెంకటస్వామి, లింగస్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అక్రమంగా కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, గౌరీశంకర్, రఘురాం ఆరోపించారు. మంగళవారం పనులను అడ్డుకోవడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గేటు ఎదుట కాంగ్రెస్ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చూస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి

అమ్రాబాద్: కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ హాత్ సే హాత్ యాత్రలో భాగంగా వంశీకృష్ణతోపాటు ఆయన సతీమణి డాక్టర్ అనురాధ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ శ్రీనివాస్, రాజేందర్, మేరె శ్రీనివాసులు, కట్టా అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్ రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

కొల్లాపూర్: విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎఫ్‌ఎల్‌ఎన్ స్టేట్ అబ్జర్వర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం కొల్లాపూర్‌లోని గర్ల్స్ హైస్కూల్‌లో కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ బోధనపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఓ షర్ఫుద్దీన్, జిల్లా రీసోర్స్‌పర్సన్ మణికంఠ, కోర్సు డైరెక్టర్ శోభారాణి, విజయలక్ష్మి, మహేష్, వసంత, విష్ణుమూర్తియాదవ్ తదితరులు న్నారు.

డీఎస్పీ, సీఐలకు సన్మానం

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పార్థసారధిగౌడ్, కల్వకుర్తి సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులను మంగళవారం నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు మంగళవారం శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రుక్కయ్య గౌడ్, నాగేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, తదితరులు సన్మానించారు.

ఉపాధ్యక్షుడికి..

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో నియోజకవర్గ గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొట్ర గ్రామానికి చెందిన నాగరాజుగౌడును మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్యముదిరాజ్, నాయకులు శేఖర్, వెంకటయ్య, మల్లయ్య, మల్లేష్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దెలో చంద్రశేఖర్ గౌడ్‌కు సంబంధించిన పాడి ఆవు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వేలాడుతున్న విద్యుత్ తీగలకు పాడి ఆవు తగలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. దీని విలువ రూ.90 వేలు ఉంటుందని తెలిపాడు.

బీసీల రాజ్యాధికారమే లక్ష్యం



నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుడు అరవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం పాతకలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు మల్లేష్ యాదవ్, శంకర్ యాదవ్, విష్ణు యాదవ్, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులపై తప్పుడు బోర్డులు

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం ఎరువులపై అందిస్తున్న సబ్సిడీని రాష్ట్రం అందిస్తున్నట్లు ఆగ్రోకేంద్రం నిర్వాహకులు తప్పుడు బోర్డులు ప్రదర్శిస్తున్నారని అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏఓ మంజులకు వినతి పత్రం అందజేశారు. ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు సబ్సిడీ బోర్డులను ఉంచేవిధంగా చూడాలని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 28–28–0, 20–20–13, డీఏపీ, యూరియా ఎరువులపై సబ్సిడీ అందిస్తుందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న దుకాణ యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఏఓను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగయ్యయాదవ్, రామస్వామి, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన అభ్యర్థికి సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని పెద్దముద్దునూరులో వివేకానంద విద్యాలయం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి మేకల లింగస్వామి ఎస్‌ఐ ఉద్యోగం సాధించడంతో పాఠశాల యాజమాన్యం ఆయనను శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీ చిక్కొండ్ర శ్రీశైలం , పద్మజ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాధవానిపల్లికి చెందిన మాదాని సంధ్య ఎస్‌ఐ ఉద్యోగం సాధించింది. తండ్రి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

లింగాల: మండల కేంద్రంలోని శివారులో సాగుచేసిన మొక్కజొన్న పంటను ఏఓ నాగార్జున రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో 9,500 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారని ఆయన తెలిపారు.

రికార్డుల పరిశీలన

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో మంగళవారం ఎంపీడీఓ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీలోని రికార్డులతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, బోరును పరిశీలించారు. వంద శాతం మొక్కలను నాటాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్లు, పల్లెప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి సునీత, ఫీల్డ్ అసిస్టెంట్ మశన్న తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికులను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామపంచాయితీ కారిమకులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ యువనాయకులు కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కావలి శ్రీనివాసులు, అబీబ్, తగిలి శ్రీనివాసులు, సలేశ్వరం, తిరుపతి గౌడ్, పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, అర్జున్, వెంకటయ్య పాల్గొన్నారు.

వెల్దండ: హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షులు మురళీధర్ వారికి మద్దతు తెలిపారు.